క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున కాలనీలో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శ్రావణమాసంను పురస్కరించుకొని గురువారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీదేవి అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ కెకె విశ్వనాధం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు క్రోసూరు మార్కెట్ యార్డు సర్వసభ్య సమావేశం

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డు సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని యార్డు కార్యదర్శి వి.శ్రీదేవి గురువారం తెలిపారు. కార్యదర్శి అధ్యక్షతన యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. యార్డు అభివృద్ధి ఎజెండాగా సాధారణ సమావేశం జరుగుతుందన్నారు. పాలక వర్గ సభ్యులు తప్పక పాల్గొనాలని ఆమె కోరారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

సత్తెనపల్లి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటు పడాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుంటూరు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అధ్యక్షత వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న మంత్రి అంబటి రాంబాబు, 5న మంత్రి విడుదల రజిని వద్దకు సామూహిక రాయబార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పత్తిపంటలో సస్యరక్షణ ముఖ్యం

నకరికల్లు: పత్తిపంటలో పోషకాలు అందించేందుకు ఒక కేజీ పొటాషియం నైట్రేట్ లేదా మల్టీకే ఒకకేజీ 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చేజర్ల గ్రామంలో పత్తిపంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంటలో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ, తామరపురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. వీటి నివారణకు ఇమిడాక్లోపిరిడ్ 200ఎస్ఎల్ 0.4ఎంఎల్ లేదా ఎసిఫేట్ 1.5ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వేప నూనె లేదా 5శాతం వేపకషాయం పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. ఉద్యాన సహాయకుడు వి.వంశీ, ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రవినాయక్‌కు ఏఎన్‌యూ డాక్టరేట్



బెల్లంకొండ: క్యాన్సర్‌పై పరిశోధనలో బెల్లంకొండ మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన రాతల రవి నాయక్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రవి నాయక్ సమర్పించిన 'ఐసోలేషన్ క్యారెక్టరైజేషన్, ఫార్ములేషన్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ ట్యూమెరోస్ ఫైటోసోమ్స్ ఫ్రమ్ కురుకుమా స్పీసీస్ ఇన్ ది ట్రీట్‌మెంట్ ఆఫ్ కోలన్ క్యాన్సర్ ' థీసిస్‌కు గానూ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ నుంచి పీహెచ్‌డీ అవార్డు పొందారు. గుంటూరులోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ అంజనా మాలే పర్యవేక్షణలో పరిశోధన గ్రంథం సమర్పించినట్లు రవినాయక్ తెలిపారు. ఈ సందర్భంగా రవినాయక్‌ను గ్రామస్తులు అభినందించారు.

నేడు వరలక్ష్మీ వ్రతాలకు సర్వం సిద్ధం

మాచర్ల: శ్రావణమాసంలో రెండవ శుక్రవారం పట్టణంలోని పలు అమ్మవారి దేవాలయాల కమిటీ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాల నిర్వాహణకు ఏర్పాట్లు చేశారు. పాత మాచర్లలో వేంచేసియున్న వాసవి కన్యక పరమేశ్వరి, సొసైటీ కాలనీలోని మాతా అన్నపూర్ణేశ్వరి అమ్మవారు, చంద్రవంక బ్రిడ్జి కింద ఆదిలక్ష్మి, కేసీపీకి వెళ్లే రహదారిలో కనకదుర్గ, 13వ వార్డులోని శ్రీ కనకదుర్గ, పత్తిఫ్యాక్టరీ ఆవరణలోని సత్యసాయి మందిరంలో లలిత, గాయత్రి అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు జరగనున్నట్లు తెలిపారు.



వినువీధిలో రెపరెపలాడిన దేశకీర్తి పతాక



సత్తెనపల్లిలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



ఇస్రోకు శుభాకాంక్షలు తెలుపుతూ మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

సత్తెనపల్లి: చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో సత్తెనపల్లి పట్టణంలో గురువారం సంబరాలు అంబరాన్ని తాకాయి. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గురువారం అతి పొడవైన జాతీయ జెండాతో చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్ -3 విజయవంతం చేయడంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి అపూర్వమని కొనియాడారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని వారి కృషిని మదినిండా నింపుకొని విద్యార్థులు తమ జీవితాల్లో కూడా విజయం సాధించాలన్నారు. విద్యార్థులు జయహో భారత్, జయహో ఇస్రో, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆర్.శివనాగరాజు, సచివాలయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాగర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 అద్వితీయ విజయంపై ర్యాలీలు

శ్రీ చైతన్య టెక్నో పాఠశాల ఆధ్వర్యంలో...

చంద్రయాన్ -3 విజయోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నాగార్జున నగర్‌లో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో గురువారం భారీ జాతీయ జెండాతో విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి నరసరావుపేట రోడ్ లోని చెక్‌పోస్ట్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కేకే విశ్వనాథం మాట్లాడుతూ ఇస్రో ఉద్యోగుల నాలుగేళ్ల కృషి, పట్టుదల, నిద్రలేని రాత్రులతో చంద్రయాన్ -3 విజయవంతమైందన్నారు. ఇందులో ఇస్రోలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువం పై సాఫ్ట్ ల్యాండింగ్ చాలా చక్కగా జరిగిందన్నారు. చంద్రయాన్ -2లో నేర్చుకున్న పాఠాలతో చంద్రయాన్ -3 రూపకల్పన చేశారని, ఇందులో అన్ని వ్యవస్థలను మెరుగైనవి రూపొందించా రన్నారు. ఇప్పటివరకు 12 దేశాలు 141 సార్లు ప్రయత్నించాయని, 69 సార్లు మాత్రమే విజయం సాధించాయన్నారు. అమెరికా 15 సార్లు విఫలమైందని, ఇస్రో చేపట్టిన మూడింటిలో రెండు విజయాలు, ఒక వైఫల్యం ఉందన్నారు. అది కూడా 80 శాతం విజయవంతమైందని, ఏ దేశానికి సాధ్యం కానీ ఘనత భారత్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదకూరపాడు సెయింట్ ఆన్స్ పాఠశాలలో..

పెదకూరపాడు: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో గురువారం జయహో ఇస్రో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రయాన్-3 కీలకఘట్టంలో విక్రమ్ లాండర్ నుంచి ప్రజ్ఞాన్‌రోవర్ విజయవంతంగా చంద్రుని దక్షిణధ్రువం వద్ద దిగిన విధానాన్ని విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఇస్రో చైర్మన్ సోమనాథ్, ఇతర శాస్త్రవేత్తలు చేసిన కృషిని వివరించారు. అనంతరం జాతీయపతాకాలతో జయహో భారత్ - జయహో ఇస్రో నినాదాలు చేస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు అక్షరరూపంగా ఏర్పడి ఇస్రోకు అభినందనలు తెలిపారు.

భూ-రక్ష పథకం రైతులకు వరం

ఎంపీపీ పి.కోటయ్య

క్రోసూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన జగనన్న సమగ్ర భూహక్కు-భూ రక్ష కార్యక్రమం ద్వారా రైతులకు, ప్రజల భూముల వివాదాలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ పి.కోటయ్య అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సమగ్ర భూసర్వే పై గ్రామసభ జరిగింది. కార్యక్రమానికి గ్రామసర్పంచ్ జెర్రిపోతు పిచ్చయ్య అధ్యక్షత వహించగా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే వలన భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా రైతులందరికీ ప్రభుత్వమే ఉచితంగా హద్దు రాళ్లు వేసి, పాస్ పుస్తకాలు కూడా అందజేస్తుందన్నారు. తహసీల్దార్ ఎండీ జియావుల్‌హక్ మాట్లాడుతూ త్వరలో మండలంలోని ఐదు గ్రామాల్లో భూసర్వే కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఇప్పటికే మండలంలో పారుపల్లి, పీసపాడు గ్రామాలు రీసర్వే పనులు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి ఊటుకూరు -3 వేల ఎకరాలు, గరికపాడు 1100 ఎకరాలు, అనంతవరం 2500 ఎకరాలు, అందుకూరు 1800 ఎకరాల భూమిలో రీసర్వే ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలందరూ సహకరించాలని అన్నారు. భూసర్వే పూర్తి చేసుకున్న వెంటనే ఆన్‌లైన్ పనులు చేయాల్సి ఉంటుందని, అపుడే పాస్‌పుస్తకాలు అందుతాయని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, వీఆర్వో మస్తాన్‌వలి, పంచాయతీ కార్యదర్శి ఖాజావలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సోషల్‌మీడియా కో-ఆర్డినేటర్ జె.కిరణ్ పాల్గొన్నారు.



ఊటుకూరు గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ పి.కోటయ్య.తహసీల్దార్ జియావుల్‌హక్

రెండు గ్రామాల్లో భూరక్ష గ్రామసభలు

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు, నార్నెపాడు గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం అములుపై రైతులకు అవగాహన గ్రామసభలు గురువారం నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో తహసీల్దార్ ఎం.భవానీశంకర్ పాల్గొని భూ సమస్యలను పరిష్కరించి వారికి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించి హక్కుపత్రాలను సర్వే అధికారులకు అందించి సహకరించాలన్నారు. మండల సర్వేయర్ శ్రీకాంత్ గ్రామపటంను వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్పంచ్ పోలూరి యలమంద, ఆర్ఐ పవన్ కుమార్, వీఆర్వో సుమతి, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన



నాగిరెడ్డిపాలెంలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

బెల్లంకొండ: గ్రామాలలో రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకునే విధంగా సిబ్బంది అవగహన కల్పించాలని వ్యవసాయ శాఖ క్రోసూరు డివిజన్ ఏడీఏ వి.హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాలలో వ్యవసాయ సిబ్బంది చేపడుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాలలో గల అన్నీ సర్వే నంబర్లలో వేసిన వ్యవసాయ, ఉద్యాన పంటలు అన్నీ విస్తీర్ణంతో సహా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా కౌలు రైతుల పంటలు కూడా నమోదు అయ్యేలా పంటల సాగుదారుల పత్రాలు జారీ చేసి, పంట నమోదు చేయాలని సూచించారు. పంట నమోదు చేసేటప్పుడు పంట పేరు, రకం, నాటిన తేదీ, నీటి వసతి, అంతర పంటలు, మిశ్రమ పంటలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ డి.కృష్ణయ్య, వివిధ గ్రామాల వ్యవసాయ సిబ్బంది అయ్యప్ప, శ్యాంప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరంలో పశు వైద్యశిబిరం



పశువైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటకృష్ణారెడ్డి, ఏడీ నరసింహారావు

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం, పశువిజ్ఞానబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట డివిజనల్ పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డా.యస్.సిహెచ్.నరసింహారావు పాల్గొని పశుసంవర్ధకశాఖ ద్వారా అందించే కార్యక్రమాలను, పశువిజ్ఞానబడి ద్వారా అందించే సేవలను వివరించారు. సబ్సీడీపై గడ్డికత్తిరించే యంత్రం, 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్, పెయ్యదూడలు పెట్టే వీర్యం గురించి రైతులకు వివరించారు. సత్తెనపల్లి సహాయ సంచాలకులు డా.యమ్.శ్రీనివాసరావు పశువులకు అందించే టీకాల కార్యక్రమం, సీజనల్ వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. ముందుగా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా 37 సాధారణ పరీక్షలు, 22 గర్భకోశ పరీక్షలు, 40 దూడలకు నట్టల నివారణ మందు, 50 పశువులకు గొంతువాపు టీకాలు అందించారు. మండల పశువైద్యాధికారి కరుణాకరరెడ్డి, పుల్లారెడ్డి, సిబ్బంది ప్రసాద్, వీరబ్రహ్మం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



అలరించిన రామాంజనేయ యుద్ధం నాటకం

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 11వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు గత నాలుగు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు గోదారంగనాధుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. ఈ కళ్యాణంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొత్తూరి వెంకటరమణ సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు. సుమారు 25 మంది దంపతులు పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్య, గాన కళా ప్రదర్శన నిర్వహించారు. ఈనెల 21వ తేదీ నుంచి నేటి వరకు నిర్వహించిన సాంస్కృతిక నాటికలు ఆహుతులను అలరించాయి, రామాంజనేయ యుద్ధం, అన్నమయ్య, శ్రీకృష్ణరాయభారం, పూలరంగడు(భక్త చింతామణి), సత్యహరిశ్చంద్ర నాటకాలను గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ కళాకారులచే నిర్వహించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు ఘనసత్కారం

రాజుపాలెం: వృత్తిలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పటికైనా మంచి ఫలితం ఉంటుందని, కష్టానికి గుర్తింపుగా ఐదుగురు అధికారులకు ఉత్తమ అవార్డులు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐదుగురు అధికారులు ఉత్తమ అవార్డులు అందుకున్నందుకుగానూ ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు కలసి అభినందన సభ గురువారం నిర్వహించారు. మండలంలోని ఉత్తమ అధికారులుగా ఎంపికైన ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లిఖార్జునశర్మ, ఏపీఓ చెవుల వెంకటేశ్వర్లు, ఏపీఎం సునీత, లైబ్రేరియన్ కె.ఎస్.ఎస్ ప్రసాద్‌లను ఎంపీపీ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగస్తులు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పశ్యావుల కోటేశ్వరరావు, ఏఓ ఎం. రమేష్ బాబు, ఈవోపీఆర్‌డీ ముక్కంటి, మండల సమైఖ్య అధ్యక్షురాలు సిలార్‌బీ, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్‌జీసీ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ అధికారులుగా ఎంపికైన వారిని సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, సిబ్బంది

దిశ చట్టంపై అవగాహన అవసరం

మాచర్ల: ప్రతి విద్యార్థిని మహిళా సాధికారత గురించి తెలుసుకొని వివిధ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ పఠాన్ నాగూర్ వలి, ఎం.వెంకటనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని మహిళా పోలీసులు శ్రీలక్ష్మి, సంధ్యారాణి, ఉషారాణి, నాగమణిలు కళాశాలలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కాలేజీ డైరెక్టర్ పఠాన్ నాగూర్ వలి, ఎం.వెంకటనారాయణ మాట్లాడారు. మహిళా పోలీసులు మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలకు ఇబ్బంది కలిగినప్పుడు దిశా యాప్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవగాహన సూచనలు కల్పించారు. మహిళా పోలీసులతో పాటు, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరం



ఏరియా వైద్యశాలలో రక్తదానం చేస్తున్న యువకులు

సత్తెనపల్లి: నేషనల్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ షేక్ సమీర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఏరియా వైద్యశాలలో వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ రక్తదాన శిబిరం సత్తెనపల్లిలో ఏర్పాటు చేసి సమీర్ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం కొత్త రామకృష్ణను, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. రక్తదాన శిబిరంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు. చందులూరి నరసింహారావు, సమీర్, పసుపులేటి రుద్ర వెంకటేష్, షేక్ నాగుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డిని సత్కరించిన నాయకులు



విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న చల్లంచర్ల, పక్కన మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్సార్ సీపీ దక్షిణ కోస్తా జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ వి.విజయసాయిరెడ్డిని గురువారం నరసరావుపేటలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో సత్తెనపల్లి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, సెగ్గెం వెంకటేశ్వరరావు, నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ ఏకుల ప్రసాదరావు

పెదకూరపాడు: తెలుగు భాష దినోత్సవం సందర్భంగా గురువారం సత్తెనపల్లిలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కో-ఆర్డినేటర్ రాగిపాటి మాబుల్ పెదకూరపాడు ఎంఈఓ ఏకుల ప్రసాద రావు ఆధ్వర్యంలో ప్రతిభాపరీక్షలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. క్రోసూరు మండలం నుంచి ఎస్‌కె మౌలా జాస్మిన్, షేక్ షాహీద్, అమరావతి మండలం ఎస్‌కే ఆషిక్, అచ్చంపేట మండలం దాసరి అనుష్క, బెల్లంకొండ మండలం కొర్రపాటి అఖిలరాణిలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పెదకూరపాడు ఎంఈఓ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో భాషలు ఉన్నప్పటికీ తెలుగు భాష ఎంతో మాధుర్యమైనదన్నారు. ప్రతిభ కనబరిచి ఐదుగురు విద్యార్థులు ఈనెల 26న నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో జరిగే జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలోవివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దూరవిద్య విధానంతో చదువు కొనసాగించొచ్చు

అపోస్ స్టేట్ కో-ఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ



అపోస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ, ఏడీ హుస్సేన్

ముప్పాళ్ళ: మధ్యలో ఆగిపోయిన చదువును దూర విద్యా విధానం ద్వారా మళ్లీ కొనసాగించవచ్చని అపోస్ (ఏపీ ఓపెన్ స్కూల్) రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎస్.అక్బర్‌అలీ చెప్పారు. మండలంలోని ముప్పాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో అపోస్ అడ్మిషన్ల ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(దూరవిద్యా విధానం) ద్వారా 2023-24 విద్యాసంవత్సరం పదవతరగతి, ఇంటర్మీడియట్‌ను పూర్తి చేయవచ్చన్నారు. బడి మానేసి 14సంవత్సరాలు నిండిన అందరూ పదవ తరగతిలో చేరవచ్చన్నారు. అలాగే 15 సంవత్సరాలు నిండి పదవతరగతి పూర్తయిన వారందరూ ఇంటర్మీడియట్ కోర్సు చదువుకునే అవకాశం ఉందన్నారు. ఇంటర్మీడియట్ మానివేసిన వారికి, ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. వారికి పాఠ్యపుస్తకాలు, సులభమైన స్వయం అభ్యసన సామగ్రి అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఏపీఆన్‌లైన్ ద్వారా గాని, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా అపోస్(దూరవిద్యావిధానం) కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జడ్పీ పాఠశాలలోను, చాగంటివారిపాలెం గ్రామ సచివాలయంలోను ఆవిష్కరించారు.అపోస్ ఏడీ కేఎంఏ హుస్సేన్, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ కె.వి.సుబ్బారెడ్డి, ఎంఈఓ ఒంగోలురాజు, పాఠశాల హెచ్‌ఎం కుంభా నాగేంద్రమ్మ, పి.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం, దూర విద్యా విధానం ద్వారా డైరెక్ట్‌గా టెన్త్, ఇంటర్ కోర్సులలో చేరేందుల విద్యార్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టేట్ కో-ఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏపీ సార్వత్రిక విద్యాపీఠం వారి పోస్టర్స్ విడుదల చేశారు. 14సంవత్సరాలు నిండినవారు ఎలాంటి విద్యార్హత లేకుండా 10వ తరగతి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. పది ఉత్తీర్ణులైనవారు ఇంటర్‌లో చేరవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోపు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్‌ఎం సీహెచ్ కళ్యాణికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కేఎంఏ హుస్సేన్, మండల శాఖ అధ్యక్షులు సీహెచ్ కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్నేహహస్తాలు' చొరవ అభినందనీయం



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ నరసింహారావు, స్నేహహస్తాలు ప్రతినిధులు

అచ్చంపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి స్నేహ హస్తాలు చూపిస్తున్న చొరవ అభినందనీయమని ఎంఈఓ రావిపాటి నరసింహారావు అన్నారు. మండలంలోని చెరుకుపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 150మంది విద్యార్థులకు రూ.30వేల విలువచేసే నోట్‌బుక్స్, కాపీ రైటింగ్ బుక్స్ తదితర స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన, నాణ్యమైన విద్య అందుబాటులో ఉందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాల్సిందిగా కోరారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచితంగా జగనన్న కిట్స్ అందజేయడం జరుగుతుందని చెప్పారు. అమ్మఒడి బడికి పంపే ప్రతి తల్లికి యేడాదికి రూ.15వేలు నేరుగా బ్యాంకులో జమచేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షుడు శౌరిరెడ్డి మాట్లాడుతూ స్నేహ హస్తాలు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంస్థ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, గ్రామ సర్పంచి చింతగుంట్ల అనూరాధ, హనుమంతరావు దంపతులు, హెచ్‌ఎం ఎనేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భవితకేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ఎస్.ప్రసాద్, పక్కన ఫిజియోథెరపీ డాక్టర్ రాంబాబు

నకరికల్లు: భవితకేంద్రం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వరం లాంటిదని ఎంఈఓ-2 ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక భవితకేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో గురువారం ఫిజియోథెరపీ వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన ఎంఈఓ మాట్లాడుతూ భవితకేంద్రంలో శిక్షణపొందుతున్న పిల్లలకు కావలసిన ఉపకరణాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. పిల్లల స్థితిని గుర్తించి వారికి అర్థమయ్యే విధంగా బోధించడం, వారి బాగోగులు చూడడం గొప్ప సేవా కార్యక్రమమని ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ప్రతి గురువారం ఉచిత వైద్యశిబిరంతో పాటు, శనివారం విద్యార్థుల ఇంటివద్దకు వెళ్లి ఉపాధ్యాయులు శిక్షణను ఇస్తారని అన్నారు. హెచ్‌ఎం మేదరమెట్ల స్వామి, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు బి.రమేష్, జయలక్ష్మి పాల్గొన్నారు.